క్లుప్తంగా

జెడ్పీ పాఠశాలలో బేస్‌లైన్ పరీక్షలు



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్‌పై పదో తరగతి విద్యార్థులకు బుధవారం బేస్‌లైన్ పరీక్షలు ప్రారంభించారు. నూతన విధానంలో నిర్వహించిన ఇంగ్లిష్ పరీక్షలో విద్యార్థులు అసౌకర్యానికి గురి కాకుండా నెట్ సౌకర్యం, టెక్నికల్ సపోర్టు ఇచ్చారు. ఈ పరీక్షలను అబ్జర్వర్ మురళీ కృష్ణారెడ్డి, జిల్లా నోడల్ ఆఫీసర్ షేక్ సైదా సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్, కో ఆర్డినేటర్ రమాదేవి మాట్లాడుతూ.. బేస్‌లైన్ పరీక్షలు ఈనెల 24వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. నూతన పద్ధతిలో పరీక్షలు నిర్వహించడంతో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా తగిన ఏర్పాట్లు చేశామన్నారు. అకడమిక్ కో ఆర్డినేటర్ శ్రీదేవి, టెక్నికల్ కో ఆర్డినేటర్లు విజయకుమార్, ఎల్.దుర్గాప్రసాద్, జీవన్, సీఆర్పీ భాగ్యశ్రీ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకి సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు గురువారం అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ.. సిద్ధార్థ ఫీడర్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. దీని కారణంగా బీజేఆర్ నగర్, నిడమానూరు రోడ్డు, పోరంకి సెంటర్, ప్రభునగర్, బందరు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఈఈ కోరారు.

వాటర్ పైప్‌లైన్‌కు మరమ్మతులు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరు చాటలబావి ప్రాంతంలో బుధవారం ప్రధాన వాటర్ పైప్‌లైన్‌కు మరమ్మతులు నిర్వహించారు. ఈ ప్రాంతంలో వాటర్ పైప్‌లైన్ లీక్ అవ్వడంతో తాగునీటి సరఫరాలో కొంత అంతరాయం ఏర్పడింది. దీంతో పంచాయతీ అధికారులు స్పందించి చాటలబావి ప్రాంతంలో సిబ్బందితో లీకైనా పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించారు. మధ్యాహ్నం నుంచి తాగునీటిని యథావిధిగా సరఫరా చేశారు.

క్యాన్సర్ చికిత్సకు సీఎంఆర్ఎఫ్ మంజూరు



గన్నవరం: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న మండలంలోని కేసరపల్లి గ్రామానికి చెందిన ఉమ్మనేని పార్వతికి వైద్య చికిత్సల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.1.50 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు బుధవారం పార్వతి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం లాంటిదన్నారు. పార్వతికి మెరుగైన చికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసిన వెంటనే అనుమతులు మంజూరయ్యాయన్నారు. అనారోగ్య బాధితులు అవసరమైన సమయంలో సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా నాగసాయిబాబా మందిర వార్షికోత్సవం

పి.నైనవరం(విజయవాడరూరల్): పి.నైనవరం గ్రామంలో శ్రీనాగసాయిబాబా మందిరం ద్వితీయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. బాబావారికి విశేష అలంకరణ చేసి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు జరిపారు. లక్ష్మిగణపతి హోమం, నవగ్రహ హోమం, బాబావారి మూలమంత్ర హోమాలు చేపట్టారు. పి.నైనవరం, అంబాపురం పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి, బాబావారిని దర్శించుకున్నారు. పూర్ణాహూతి, బాబావారి మధ్యాహ్న హారతి అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఆలయ ధర్మకర్త షేక్ లాల్ బాషా, పీరాబి దంపతుల ఆధ్వర్యంలో దీవి లక్ష్మీనారాయణచార్యులు, అద్దేపల్లి శివరామకృష్ణ ప్రసాద్ శర్మ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్ట్

కంకిపాడు: బెల్టుషాపు నిర్వాహకుడిని కంకిపాడు పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు... ఈడుపుగల్లు గ్రామానికి చెందిన ఇందుపల్లి రవి బెల్టుషాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో అతని ఇంటిని సోదా చేయగా 7 మద్యం సీసాలు లభ్యమయ్యాయి. మద్యం సీసాలను సీజ్ చేసి నిర్వాహకుడు రవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సందీప్ మాట్లాడుతూ బెల్టుషాపుల నిరోధానికి పటిష్టంగా చర్యలు తీసుకుంటున్నామని, బెల్టు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మెట్ట ప్రాంతంలో సాగునీటికి కటకట

- వెలవెలబోతున్న చెరువులు
- పోలవరం కాల్వపై విద్యుత్ మోటార్లు కట్
- అదునుకు సాగునీరు అందక రైతుల ఇక్కట్లు



నీళ్లు లేక వెలవెలబోతున్న అంపాపురంలోని మల్లిగాడి చెరువు

హనుమాన్‌జంక్షన్ రూరల్: మెట్ట ప్రాంత రైతాంగం సాగునీటికి కటకటలాడుతున్నారు. చెరువుల్లో నీళ్ల లేక అడుగంటిపోయాయి. కాలువలు ఎండి బీటలు వారుతున్నాయి. దీంతో రైతులు వరుణుడి కటాక్షం కోసం ఆకాశం వైపు చూస్తున్నారు. గన్నవరం నియోజకవర్గంలో సగం భాగం డెల్టా ప్రాంతం కాగా, మరికొన్ని గ్రామాల్లో మెట్ట ప్రాంతంలో ఉన్నాయి. గన్నవరం, బాపులపాడు, విజయవాడ రూరల్ పరిధిలో మెట్ట ప్రాంతంలో దాదాపు 60 వేల ఎకరాల భూమి సాగులో ఉంది. వరి, మామిడి, మొక్కజొన్న, చెరకు, కూరగాయలు వంటి పంటలు ప్రధానంగా సాగులో ఉన్నాయి.

అందని పోలవరం కాలువ నీళ్లు

బాపులపాడు మండలం వేలేరు నుంచి విజయవాడ రూరల్ మండలం వరకు మెట్ట ప్రాంతంలో పోలవరం కుడి ప్రధాన కాలువ దాదాపు 60 కిలోమీటర్లు పొడవునా గన్నవరం నియోజకవర్గంలోని ప్రవహిస్తుంది. పట్టిసీమ ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి పోలవరం కాలువకు విడుదల చేసిన గోదావరి జలాలు ఈ మెట్ట ప్రాంత పొలాలకు అనుకుని వెళ్తున్నప్పటికీ ఆ నేల దాహార్తిని తీర్చలేకపోతున్నాయి. గతంలో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ దాదాపు 500 విద్యుత్ మోటార్లు ఉచితంగా పోలవరం కాలువ గట్టుపై ఏర్పాటు చేసి ఆయా గ్రామాల్లోని సాగునీటి చెరువులను నింపేందుకు వినియోగించేవాళ్లు. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పోలవరం



రంగన్నగూడెంలోని ఊర చెరువు దుస్థితి

గట్లపై వ్యవసాయ విద్యుత్ మోటార్లు లేకపోవటంతో మెట్ట ప్రాంతంలో సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే వంశీ సొంత ఖర్చుతో ఏర్పాటు చేసిన విద్యుత్ వ్యవసాయ బోర్లు వినియోగించుకునేందుకు రైతులు ఆశతో ఉన్నప్పటికీ అధికార టీడీపీ నేతలు అడ్డుపడుతున్నారు. దీంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

అడుగంటిన చెరువులు

మెట్ట ప్రాంతంలో ప్రధాన సాగునీటి వనరులైన చెరువులు నీళ్ల లేక వెలవెలబోతున్నాయి. ఖరీఫ్ సీజన్ ఆరంభం నుంచి వర్షాలు అంతంత మాత్రంగా ఉండటంతో చెరువుల్లో నీళ్ల లేవు. దీంతో మెట్ట ప్రాంత రైతులు పూర్తిగా వ్యవసాయ విద్యుత్ మోటార్లపైనే సాగునీటికి ఆధారపడుతున్నారు. చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయ బోర్లు లేకపోవటంతో పంటలకు అదునుకు సాగునీరు అందించలేక తీవ్ర ఆందోళనలో ఉన్నారు. మరో పక్క వర్షాల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రధానంగా వరినాట్లు వేసే తరుణం కావటంతో అదును తప్పితే పంట దిగుబడిపై ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కృష్ణానదిలో కలుషిత నీటికి అడ్డుకట్ట

పెనమలూరు: కృష్ణానదిలో యనమలకుదురు వద్ద కలుషిత నీరు అధికంగా ప్రవహిస్తోంది. గ్రామంలో పశువులను కాపాడుకోవటానికి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నదిలో బుధవారం జేసీబీతో కలుషిత నీటిలో పశువులు దిగకుండా, సీవేజ్ ప్లాంట్ నుంచి నీరు నదిలో ప్రవహించకుండా అడ్డు కట్ట వేశారు. అయితే మరో నాలుగు గేదెలు కలుషిత నీటిలో దిగి నీరు తాగి ప్రాణాపాయస్థితికి చేరుకున్నాయి. దీంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. విజయవాడ నగరపాలకసంస్థ(వీఎంసీ)కు చెందిన సీవేజ్ ప్లాంట్ రామలింగేశ్వరనగర్‌లో ఉంది. ఈ ప్లాంట్ నుంచి కలుషిత నీరు విడుదలై నేరుగా కృష్ణానదిలోకి చేరుతోంది. ఇసుక మాఫియా ఇసుక తవ్వకాల వలన ఏర్పడిన గుంతల్లో కలుషిత నీరు చేరి చెరువులా మారింది. అయితే మూగజీవాలు నదిలోని కలుషిత నీరు తాగి మంగళవారం మూడు గేదెలు మృత్యువు వాతపడ్డాయి. కాగా బుధవారం మరో నాలుగు గేదెలు కలుషిత నీరు తాగి తీవ్ర అస్వస్థతకు గురై ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. గేదల ప్రాణాలు కాపాడాలని పశుపోషకులు వైద్య పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. అయితే గేదెల పరిస్థితి విషమంగానే ఉంది.



కృష్ణానదిలో జేసీబీతో కలుషిత నీటికి అడ్డుగా కట్ట వేసిన గ్రామస్తులు

నదిలో అడ్డుకట్ట..

సీవేజ్ ప్లాంట్ నుంచి నదిలోకి కలుషిత నీరు రాకుండా ఉండటానికి గ్రామస్తులు జేసీబీతో అడ్డు కట్ట వేశారు. అలాగే గేదెలు నదిలో కలుషిత గుంతల్లో దిగకుండా ఉండటానికి కూడా అడ్డుగా కట్ట వేశారు. అయితే సీవేజ్ ప్లాంట్ నుంచి ఇంకా కలుషిత నీరు విడుదల అవుతూనే ఉంది. పరిస్థితి దారుణంగా మారినా అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవటంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై కోర్టును ఆశ్రయిస్తామని గ్రామస్తులు తెలిపారు.

గేదెల మరణంపై కేసు నమోదు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో కృష్ణానదిలో కలుషిత నీరు కారణంగా గేదెల మరణాలపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు గ్రామానికి చెందిన ముక్కామాల కిరణ్, దారపనేని సాయి, పఠాన్‌జాన్ వలికి చెందిన గేదెలు మంగళవారం కృష్ణనదిలో మేతకు వెళ్లి రామలింగేశ్వరనగర్‌లోని విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ సీవేజ్ ప్లాంట్ నుంచి విడుదలైన కలుషిత నీరు తాగి మరణించాయి. మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే గేదెలు మరణించాయని బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పబ్లిక్ హెల్త్ యూనిట్‌కు శంకుస్థాపన



పెనమలూరు పీహెచ్‌సీలో శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్, వైద్యులు

పెనమలూరు: పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50 లక్షలతో నిర్మించనున్న బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌కు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసాద్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నిధులు ఎన్‌హెచ్ఎం 15వ ఆర్థిక సంఘ నిధులతో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ నిర్మాణం చేస్తామన్నారు. ఈ ల్యాబ్ ద్వారా 173 రకాల మందులు, 67 రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. టీడీపీ ప్రభుత్వం విద్య, వైద్యానికి ప్రాధాన్యం కల్పిస్తోందని, అన్ని వర్గాల ప్రజలకు సేవలు అందిస్తామన్నారు. ప్రభుత్వం ప్రతి కుటుంబానికి బీమా సౌకర్యం కల్పించి, కార్పొరేట్ వైద్యం అందించేందుకు ఆలోచన చేస్తుందన్నారు. ప్రభుత్వం ద్వారా అందుతున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి బి.శ్రీనివాస్, సర్పంచ్‌లు లింగాల భాస్కరరావు, కాకర్ల వెంకటరత్నం, వార్డు సభ్యురాలు తోటకూర శ్రీదేవి, నాయకులు మారుపేడి ధనకోటేశ్వరరావు, కోయా ఆనంద్, అనుమోలు ప్రభాకరరావు, చిగురుపాటి శ్రీనివాసరావు, యలమంచిలి గోపిక, బొమ్మిడి అన్నపూర్ణ, అరవపల్లి శివప్రసాద్, కిలారు సుబ్బారావు, జాన్, మటపర్తి బుజ్జి పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణపై దృష్టి సారించాలి



గన్నవరం: శాంతిభద్రతల పరిరక్షణపై పోలీసులు ప్రధానంగా దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ గంగాధరరావు ఆదేశించారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా బుధవారం భారత్ బంద్ కొనసాగుతున్న నేపథ్యంలో ఆయన గన్నవరం ప్రాంతంలో పర్యటించారు. బంద్ ప్రభావంపై స్థానిక సీఐ శివప్రసాద్ నుంచి వివరాలు సేకరించారు. బంద్ వల్ల ప్రజలకు అసౌకర్యం లేకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఎస్ఐ శివప్రసాద్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన రైతులకు రాయితీలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఉద్యాన వంటలకు సబ్సిడీపై డ్రిప్, స్ప్రింకర్లు, పైపులు పంపిణీ చేయనున్నట్లు బాపులపాడు మండల ఉద్యాన అధికారి హరిచంద్ బుధవారం తెలిపారు. ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి బయోమెట్రిక్ ద్వారా రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని సూచించారు. దీని కోసం పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా, ఎఫ్ఎంబీ, ఆర్‌వోఆర్ కాపీలను తీసుకుని వెళ్లాలన్నారు. ఉద్యాన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఓ హరిచంద్ కోరారు.

వీరవల్లి ఎస్ఐగా శ్రీనివాస్

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లి పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఎం.చిరంజీవి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గుడివాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎం.శ్రీనివాస్‌ను ఇక్కడకు బదిలీ చేస్తూ బుధవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న చిరంజీవిని వీఆర్‌కు పంపారు.

విభజించి పాలించే కుట్రలను తిప్పికొట్టాలి



కంకిపాడులో రాజుతో మాట్లాడుతున్న సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ సందీప్



గన్నవరం బస్టాండ్ వద్ద రాస్తారోకో చేస్తున్న సంఘ నేతలు

కంకిపాడు: కేంద్ర ప్రభుత్వం ఎస్సీలను విభజించి పాలించే ఆలోచన చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు పిలుపునిచ్చారు. దళిత సంఘాల పిలుపు మేరకు బుధవారం భారత్ బంద్‌లో భాగంగా సంఘం ఆధ్వర్యంలో కంకిపాడులో రాస్తారోకో నిర్వహించారు. రాజు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, ఆర్టికల్ 341కు వ్యతిరేకమన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోందని విమర్శించారు. వర్గీకరణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ విధానాలను, వైఖరిని మార్చుకోవాలని సూచించారు.

ఆందోళనను అడ్డుకున్న పోలీసులు..

మాలమహానాడు చేపట్టిన ఆందోళనను పోలీసులు అడ్డుకున్నారు. రాస్తారోకో చేపట్టిన ఆందోళనకారులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నేతలు కోరారు. ఆందోళనకారులతో సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ సందీప్ సంప్రదింపులు జరిపారు. కార్యక్రమంలో సంఘ నేతలు వర్రె చిట్టిబాబు, సిరివెళ్ల చిట్టిబాబు, సరిహద్దు ఆంతోని, పి.రామకృష్ణ, పిల్లి క్రీస్తుబాబు, సతీష్, బెర్నాడ్‌షా, నరసింహ పాల్గొన్నారు.

గన్నవరంలో ఆందోళన

గన్నవరం: ఎస్సీలను, వాటి ఉపకులాలను విభజించి పాలించే ఆలోచనను బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు గోగులమూడి రాజు తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం చేపట్టిన భారత్ బంద్‌లో భాగంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ... పార్లమెంట్‌లో బిల్లు పెట్టకుండానే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం సరికాదన్నారు. ఈ తీర్పు రాజ్యాంగానికి విరుద్ధమన్నారు. ఎస్సీ వర్గీకరణ వల్ల మాలలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. అన్నదమ్ములాంటి మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టే కుట్రలను రాజకీయ పార్టీలు మానుకోవాలని హితవు పలికారు. ఇప్పటికైనా రిజర్వేషన్లు, హక్కుల కోసం మాలలందరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి వర్రె చిట్టిబాబు, నియోజకవర్గ అధ్యక్షుడు సరిహద్దు ఆంతోని, జిల్లా నాయకులు కొమవరపు ప్రసాద్, ఉదయభాస్కర్, మారుమూడి రాంబాబు పాల్గొన్నారు.

ప్రశాంతంగా బంద్

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ, క్రిమిలేయర్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ మాల మహానాడు ఆధ్వర్యంలో హనుమాన్‌జంక్షన్‌లో బుధవారం బంద్ నిర్వహించారు. దీంతో హనుమాన్‌జంక్షన్‌లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, పోస్టాఫీసు, వర్తక, వాణిజ్య దుకాణాలు మూతబడ్డాయి. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బేతాళ శరత్‌బాబు నేతృత్వంలో అధిక సంఖ్యలో యువత ద్విచక్రవాహనాలపై ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సుప్రీంకోర్టు తీర్పును మరోమారు పునః సమీక్ష చేయాలని డిమాండ్ చేశారు. మాలమహానాడు యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కొత్తూరు సాగర్, నాయకులు దాసరి బెనర్జీ, వరిగంజి కిషోర్, ఇంటి దేవసహాయం, తోకల నాగరాజు, తుమ్మల ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.



జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న కార్యకర్తలు

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి



డిపో మేనేజర్ శ్రీనాథుడికి వినతి పత్రం అందజేస్తున్న వైన్ షాప్స్ ఉద్యోగులు

రామవరప్పాడు: మద్యం దుకాణాల్లో పని చేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ వైన్స్ షాప్స్ కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో వైన్ షాప్స్ ఉద్యోగులు బుధవారం నిడమానూరులోని ఐఎంఎఫ్ఎల్ డిపో మేనేజర్ శ్రీనాథుడికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఉద్యోగ భద్రత, సరిగ్గా జీతాలు అందని పరిస్థితులను డిపో మేనేజర్‌కు వివరించామన్నారు. కూటమి ప్రభుత్వం అక్టోబర్ 1వ తేదీ నుంచి నూతన మద్యం పాలసీ తీసుకువస్తామని ప్రకటించడంతో బేవరేజ్ సంస్థలో పని చేస్తున్న వేలాది మంది ఉద్యోగాలు కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. నూతన మద్యం పాలసీ అందుబాటులోకి వచ్చి తమ ఉద్యోగాలు తొలగించాల్సిన పరిస్థితి వస్తే, ఇతర సంస్థల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగాలు కల్పించాలని కోరారు. సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు తమకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.

తైక్వాండో క్రీడాకారిణి బ్లెస్సీ నేహకు అభినందన



బ్లెస్సీ నేహాను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామోజీరావు, ఏఓ మధుసూదనరావు, వైద్యులు

గన్నవరంరూరల్: విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించటం ఎంతో గొప్ప విషయమని చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వర రావు సిద్ధార్థ దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు అన్నారు. కళాశాల రెండో సంవత్సరం బీడీఎస్ విద్యార్థిని పి.బ్లెస్సీ నేహకు బుధవారం అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఈ నెల 17, 18వ తేదీల్లో విజయనగరంలో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో(మార్షల్ ఆర్ట్స్) ఛాంపియన్‌షిప్ 2024 పోటీల్లో బ్లెస్సీ నేహ పాల్గొని బంగారు పతకం సాధించిందన్నారు. ఆమె స్ఫూర్తితో మిగిలిన విద్యార్థులు కూడా క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, దేహ దారుఢ్యానికి ఉపయోగపడతాయన్నారు. క్రీడల వల్ల నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని తెలిపారు. హైదరాబాద్‌లో జరిగే జాతీయ ఛాంపియన్ పోటీలకు నేహ ఎంపిక కావటం కళాశాలకు గర్వకారణమన్నారు. మరిన్ని విజయాలు సాధించాలని ఏఓ వై.మధుసూదనరావు ఆకాంక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్.కోటేశ్వరరావు, డాక్టర్ నాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కోచ్ అంకమ్మరావును సత్కరించారు.

హత్య కేసులో అరెస్ట్ వారెంట్ జారీ

ఉంగుటూరు: భార్యను హత్య చేసిన కేసులో నిందితుడి కోసం కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసిందని ఉంగుటూరు ఏఎస్ఐ సత్తార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముదినేపల్లి మండలం అల్లీనాగారానికి చెందిన కొండిపాముల కోటేశ్వరరావు కుటుంబం ఉంగుటూరు మండలం ఇందుపల్లి వచ్చి నివాసం ఉంటుంది. 2011వ సంవత్సరం ఫిబ్రవరిలో ఇందుపల్లిలో కోటేశ్వరరావు తన భార్యపై అనుమానంతో మద్యం మత్తులో హత్య చేశాడు. దీనిపై ఉంగుటూరు పోలీస్ స్టేషన్‌లో హతురాలి పెద్దకుమారుడు కొండిపాముల నాగరాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. ఈ కేసు గుడివాడ అదనపు జిల్లా న్యాయస్థానంలో విచారణలో ఉందని, కేసులో నిందితుడు కోటేశ్వరరావు దీర్ఘకాలంగా కోర్టు వాయిదాలకు గైర్హాజరు అవుతున్నాడని గుర్తించిన న్యాయమూర్తి ముద్దాయి కోటేశ్వరరావును అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచాల్సిందిగా అరెస్ట్ వారెంటు ఇచ్చినట్లు ఏఎస్ఐ సత్తార్ చెప్పారు. ఈ కేసులో నిందితుడు కోటేశ్వరరావు ఆచూకీ ఎవరికైనా తెలిసినా ఆ సమాచారాన్ని వెంటనే గుడివాడ 11వ అదనపు జిల్లా కోర్టుకు గానీ, ఉంగుటూరు పోలీసులకు 94406 27043, 91548 75955 ఫోన్ నంబర్లకు సమాచారం తెలియజేయాలని కోరారు.

దుర్గమ్మ సన్నిధిలో సంగీత విభావరి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన నాదెండ్ల ఫణికుమారి బృందంచే ఆలపించిన సంగీత విభావరి అలరించింది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ధర్మపథం వేదికపై ఫణికుమారి బృందం పలు కీర్తనలకు మధురంగా ఆలపించారు. అనంతరం శిష్య బృందానికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందించారు.

టెక్నాలజీ రంగాల్లో ఉపాధి అవకాశాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రస్తుత సమాజంలో టెక్నాలజీ రంగాల్లో ఉపాధి అవకాశాలు పొందాలంటే నైపుణ్యాలు పెంపొందించుకోవాలని లింకెడిన్ ట్రైనర్ నిస్సీ తెప్పలి అన్నారు. ఎంజీరోడ్డులోని శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో బుధవారం ట్రెండింగ్ స్కిల్స్ ఎక్రాస్ డొమైన్స్ ఇన్ టెక్నాలజీ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న నిస్సీ విద్యార్థులకు లింకెడిన్ ప్రొఫైల్స్ క్రియేట్ చేయించి, ప్రీమియమ్ సబ్‌స్క్రిప్షన్స్‌ను ఆరు నెలల వరకూ ఉచితంగా వినియోగించే అవకాశాన్ని కల్పించారు. దీని ద్వారా విద్యార్థులు ఎన్నో ఆన్‌లైన్ సర్టిఫికేషన్స్ చేసుకుని వారి ప్రొఫైల్‌ను, బయోడెటాను అప్‌డేట్ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, ప్లేస్‌మెంట్ అధికారి పి.హారిక, కంప్యూటర్ విభాగాధిపతి ప్రవీణ పాల్గొన్నారు.

వయ్యారిభామతో తీవ్ర నష్టం



వయ్యారిభామ మొక్కల ప్రమాద తీవ్రతను వివరిస్తున్న శాస్త్రవేత్తలు

ఉయ్యూరు: వయ్యారి భామ పంటలకు, ప్రజలు, మూగ జీవాల ఆరోగ్యానికి ప్రమాదమని, తీరని నష్టం కలిగిస్తాయని ఉయ్యూరు చెరకు పరిశోధనాస్థానం శాస్త్రవేత్తల బృందం పేర్కొంది. 19వ జాతీయ వయ్యారిభామ కలుపు నివారణపై అవగాహన కార్యక్రమంలో భాగంగా ఉయ్యూరులో బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి, శాస్త్రవేత్త శైలజారాణిలు పాల్గొని వయ్యారిభామ వల్ల కలిగే నష్టాలను రైతులకు, కూలీలకు వివరించారు. పంట దిగుబడులు తగ్గటానికి ఏ విధంగా దోహదపడుతుందో తెలియజేశారు. ఎగ్జిమా, ఉబ్బసం, బ్రాంకైటీస్ వంటి వ్యాధులు సంక్రమించి మనిషి ఆరోగ్యానికి నష్టం కలిగిస్తాయని వయ్యారిభామతో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో పరిశోధనా స్థానం బోధనేతర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైల్వే టికెట్ చెకింగ్ సిబ్బందికి హెచ్‌హెచ్‌టీఎస్ పంపిణీ పూర్తి

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): రైల్వే టికెట్ చెకింగ్ సిబ్బందికి హ్యాండ్ హెల్డ్ టెర్మినల్ (హెచ్‌హెచ్‌టిఎస్)లను పంపిణీ చేయటం వంద శాతం పూర్తి అయిందని విజయవాడ డివిజన్ పబ్లిక్ రిలేషన్ అధికారి ఎస్.మండురూప్‌కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని టికెట్ చెకింగ్ సిబ్బందికి, స్టేషన్‌లలోని స్క్వాడ్ సిబ్బందికి 988 హెచ్‌హెచ్‌టీఎస్‌లను అందజేశామని పేర్కొన్నారు. దీంతో డివిజన్‌లో నగదు రహిత, పారదర్శకత అందుబాటులోకి వస్తుందన్నారు.

పేకాట శిబిరంపై దాడి

కంకిపాడు: పేకాట శిబిరంపై కంకిపాడు పోలీసులు బుధవారం దాడి చేశారు. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు.. మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలోని ఓ ఇంటి ప్రాంగణంలో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందింది. దాడి చేసి పేకాట ఆడుతున్న ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

పోయినవి

దిల్లకంటి తాతయ్య S/o మాణిక్యం, వీరవల్లి బాపులపాడు మండలం వీరికి సంబంధించిన డాక్యుమెంట్స్ నెంబర్స్ 1035958, 1035959, 1035963, 1035964, 1035965, 1035966, 1035967, 1035968 ఫిక్సిడ్ డిపాజిట్ బాండ్లు వీరవల్లి లో సైకిల్ పై వెళుతుండగా మార్గం మధ్యలో పోయినవి. ఎవరికైనా దొరికిన వారు క్రింది నెంబర్ కు సంప్రదించి అందజేయగలరు. సెల్ : 8558495016